

# ప్రజా న్యూస్
## నెట్‌వర్క్
నిజం.. సమాజం.. ప్రజా కోసం.. | తెలుగు దినపత్రిక







తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 136,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,శుక్రవారం, తేదీ : 18-09-2026


## తిరుమల చేరుకున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. రేపు శ్రీవారి దర్శనం



- తిరుమల పర్యటనకు విచ్చేసిన ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్
- రేపు ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్న గవర్నర్
- తిరుమలలో గవర్నర్‌కు స్వాగతం పలికిన టీటీడీ ఛైర్మన్, ఈవో
- రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల విచ్చేసిన ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్ శుక్రవారం ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. వివరాల్లోకి వెళితే, గురువారం సాయంత్రం తిరుమలలోని శ్రీభాగ్య విశ్రాంతి భవనానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎం. రవిచంద్ర, సీవీఎస్‌వో మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతించారు. మిగతా..2లో

## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు: రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్



- తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి
- రజాకార్ల ఘోరాలను గత పాలకులు తొక్కిపెట్టారని మండిపాటు
- ఎంఐఎంకు అనుకూలంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శ

హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత దాచాలని చూసినా సత్యం దాగిపోదని స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. మిగతా..2లో

## ఖైరతాబాద్ గణపతికి ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు.. పర్యావరణహిత వేడుకలపై ప్రశంసలు



- బడా గణేశ్ ను దర్శించుకున్న హరీశ్, తలసాని, కాలేరు వెంకటేశ్
- ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలన్న హరీశ్ రావు
- నిమజ్జన ఘట్టంలో అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్: భాగ్యనగరం నడిబొడ్డున కొలువైన ప్రపంచ ప్రసిద్ధ ఖైరతాబాద్ పంచముఖ సంకట మహాగణపతిని బీజేపీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు దర్శించుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహా బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
# రంగంలోకి రెవెన్యూ అధికారులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక



హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. మిగతా..2లో

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

**తీవ్రంగా స్పందించిన కేటీఆర్**



- కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం
- మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం
- పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన
- మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్
- సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

## ట్రంప్ తనయులకు సంబంధించిన
# కంపెనీతో పాక్ డీల్..

- యూఎస్‌కు చెందని డ్రోన్ తయారీ సంస్థ పవర్‌అజ్‌తో డ్రోన్ సరఫరా కోసం పాక్ ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.
- బుధవారం సంస్థ సహ వ్యవస్థాపకుడు బ్రెట్ వెలికోవిచ్ అంతర్జాతీయ మీడియాతో ఈ విషయాన్ని పంచుకున్నారు.



ఢిల్లీ : యూఎస్‌కు చెందని డ్రోన్ తయారీ సంస్థ పవర్‌అజ్‌తో డ్రోన్ సరఫరా కోసం పాక్ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సంస్థ సహ వ్యవస్థాపకుడు బ్రెట్ వెలికోవిచ్ తాజాగా అంతర్జాతీయ మీడియాతో ఈ విషయాన్ని పంచుకున్నారు. బుధవారం ఆయన పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయులు ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్‌లకు వాటాలున్న ఆరియస్ గ్రీన్‌వే హోల్డింగ్స్ అనే సంస్థలో పవర్‌అజ్ త్వరలో విలీనం కానున్న నేపథ్యంలో ఈ డీల్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే, ఎన్ని డ్రోన్స్‌ను సరఫరా చేస్తారు? డీల్ విలువ ఎంత? అనే వివరాలను మాత్రం వెలికోవిచ్ వెల్లడించలేదు. పాక్‌తో కలిసి సంయుక్తంగా ఓ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడం తమ దీర్ఘకాలిక లక్ష్యమని వెలికోవిచ్ తెలిపారు.

## ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్‌గా తవెంగ్వా ముకులాని.. చరిత్రలో తొలిసారిగా జింబాబ్వేకు అవకాశం



- అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌లో కీలక మార్పు
- ఐసీసీ కొత్త డిప్యూటీ ఛైర్మన్‌గా టవెంగ్వా ముకులాని నియామకం
- ఈ పదవి చేపట్టిన తొలి జింబాబ్వే వ్యక్తిగా రికార్డు
- 2027 ప్రపంచకప్ నేపథ్యంలో ఈ నియామకానికి ప్రాధాన్యత

## సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్
# ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు

- వేగంగా పెరుగుతున్న మౌలిక వసతులతో లాజిస్టిక్స్, తయారీ రంగాలకు కొత్త బలంగా మారిందన్న ప్రధాని
- భారత్‌లో తయారవుతున్న చిప్‌లు దేశంతో పాటు ప్రపంచ మార్కెట్లకు చేరుతున్నాయన్న మోదీ



ఢిల్లీ : సెమీకండక్టర్ రంగంలో భారత్ శరవేగంగా ముందుకు వెళ్తోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచ చిప్ తయారీకి కొత్త, నమ్మకమైన కేంద్రాల అవసరం పెరుగుతున్న సమయంలో భారత్ గ్లోబల్ హబ్ గా సిద్ధమవుతోందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని, దీంతో ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఢిల్లీలో గురువారం ప్రారంభమైన సెమీకాన్ ఇండియా 2026 ఐదో ఎడిషన్‌లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు.

### చిప్ తయారీకి భారత్

సెమీకండక్టర్ తయారీకి ప్రపంచ దేశాలు కొత్త, విశ్వసనీయ ప్రాంతాలను వెతుకుతున్నాయని మోదీ చెప్పారు. భారత్ కూడా చిప్ తయారీకి ప్రాధాన్య కేంద్రంగా ఎదిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. తయారీదారులు విజయవంతం కావడానికి అవసరమైన విధానాలు, నిబంధనలు, మౌలిక సదుపాయాలపై

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు



- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

అమరావతి : ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత,

## టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ
# భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు



- మోదీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానంపై కాశీలో 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమం చేపట్టారు.
- వారణాసిలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.
- వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.
- వారణాసిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

అమరావతి : నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు, అలాగే మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహించిన 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ అందించిన సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 'వారణాసివాద్నగర్ సేవా యాత్ర చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్నగర్ ను అనుసంధానిస్తూ నిర్వహించే ఈ యాత్రలో యువత, ప్రజాప్రతినిధులు, సేవా ప్రతినిధులు భాగస్వాములు పాల్గొన్నారు. దేశ అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత ప్రాధాన్యతను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగా శ్రీ కాశీ విశ్వనాథుడిని దర్శించుకుని, అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ లో సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమం చేపట్టారు. వారణాసిలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారణాసిలోని మిగతా..2లో

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

**కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం**



- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్‌వర్క్
|| నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||
శుక్రవారం 18-09-2026

మొదటి పేజి తరువాయి

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
## రంగంలోకి రెవెన్యూ అధికారులు

కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఖైరతాబాద్ గణపతికి ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు.. పర్యావరణహిత వేడుకలపై ప్రశంసలు

కలిసి ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... చార్మినార్, గోల్కొండ కోటల మాదిరిగానే హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను నలుదిశలా సగర్వంగా చాటడంలో ఖైరతాబాద్ వినాయకుడి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. కేవలం పరిమాణంలోనే కాక, భక్తుల నమ్మకంలోనూ ఇది 'బడియా గణేశ్'గా నిలిచిందని అభివర్ణించారు. ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తులో పూర్తిగా మట్టితో రూపుదిద్దుకున్న పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశమిచ్చిందని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి ముప్పు లేని మట్టి వినాయకులనే పూజించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు ఉత్సవాలను ఎంత వైభవంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన ఘట్టంలోనూ అంతే అప్రమత్తత అవసరమని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పటాన్‌చెరు పరిధిలో నిమజ్జనం సమయంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ముందస్తుగా ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ సమితులు సమన్వయంతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, భక్తులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరుకున్నారు.

## ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్‌గా తవెంగ్వా ముకులాని.. చరిత్రలో తొలిసారిగా జింబాబ్వేకు అవకాశం

ఢిల్లీ : అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త డిప్యూటీ ఛైర్మన్‌గా జింబాబ్వేకు చెందిన తవెంగ్వా ముకులాని నియమి తులయ్యారు. ఐసీసీ బోర్డు డైరెక్టర్లు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న ఇమ్రాన్ ఖ్వాజా స్థానంలో ముకులానీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ పదవిలో 2027 నవంబర్ వరకు కొనసాగుతారు. ఈ నియామకంతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ పదవిని అలంకరించిన తొలి జింబాబ్వే వ్యక్తిగా ముకులాని చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ముకులాని జింబాబ్వే క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీలో జింబాబ్వే ప్రతినిధిగా ఉండటంతో పాటు, ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ నామినేషన్స్ కమిటీలలో సభ్యుడిగా, హెచ్‌ఆర్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీకి హెడ్ గానూ పనిచేస్తున్నారు. దక్షిణాఫ్రికా, నమీబియాలతో కలిసి 2027 ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌కు జింబాబ్వే సహ-ఆతిథ్యం ఇవ్వనున్న తరుణంలో ముకులాని నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ మళ్లీ ఆఫ్రికాకు తిరిగి వస్తున్న వేళ, ఆయన అనుభవం ఐసీసీకి కీలకం కానుంది. ఈ సందర్భంగా ముకులాని మాట్లాడుతూ.. "నాపై నమ్మకం ఉంచిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు కృతజ్ఞతలు. ఐసీసీ ఛైర్మన్ జై షా నాయకత్వంలో పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. ఆయన మార్గదర్శకత్వంలో క్రికెట్‌ను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తాను. ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం వంటి ఉత్తేజకరమైన ఈ సమయంలో, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాల కోసం పనిచేస్తాను" అని తెలిపారు. ఐసీసీ ఛైర్మన్ జై షా స్పందిస్తూ.. "డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన తవెంగ్వా ముకులానీకి అభినందనలు. క్రికెట్ పరిపాలనలో ఆయన అనుభవం, ప్రపంచ ఆటపై ఆయనకున్న అవగాహన ఐసీసీ బోర్డుకు అమూల్యమైనవి. ఆయన నియామకం జింబాబ్వేకు ఒక చారిత్రక మైలురాయి. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను బలోపేతం చేయడానికి ఆయనతో కలిసి పనిచేస్తాను" అని పేర్కొన్నారు.

## ట్రంప్ తనయులకు సంబంధించిన కంపెనీతో పాక్ డీల్..

పాక్‌లో ప్రైవేటు డిఫెన్స్ సంస్థలు ఇంకా శైశవ దశలో ఉన్నందుకు తమ లాంటి సంస్థల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇక పాక్‌లో డిఫెన్స్ ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని కూడా వెలికోవిచ్ తెలిపారు. ఈ డీల్ వెనుక ట్రంప్ కుటుంబం ఇన్‌ఫ్లుయెన్స్ ఉందన్న వాదనలను సంస్థ సీఈఓ ఫాక్స్ కొట్టిపారేశారు. కేవలం తమ ప్రతిభ, గుర్తింపు ఆధారంగా పాక్ నుంచి ఈ కాంట్రాక్ట్ దక్కించుకున్నామని చెప్పారు. తమ కంపెనీ రోజువారీ కార్యకలాపాలు, నిర్వహణలో ట్రంప్ తనయులు పాలుపంచుకోరని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, అమెరికన్ వెంచర్స్ అనే ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ట్రంప్ సోదరులు ఆరియస్ సంస్థలో పెట్టుబడి పెట్టారు. ఆరియస్, పవర్‌అజ్ విలీనం తరువాత సంస్థలో ట్రంప్ సోదరుల వాటా 9.9 శాతంగా ఉంటుందని సమాచారం. ఈ పరిణామాలపై డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రతినిధి స్పందించారు. ట్రంప్ జూనియర్ కేవలం పెట్టుబడిదారుగా మాత్రమే ఉన్నారని అన్నారు. కంపెనీ నిర్వహణ, కాంట్రాక్టులు వంటి విషయాలతో ఆయనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ ఉదంతంపై ఎరిక్ ట్రంప్ ఇంకా స్పందించాల్సి ఉంది.

## తిరుమల చేరుకున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. రేపు శ్రీవారి దర్శనం

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్, రిసెప్షన్ అధికారులు భాస్కర్, సాత్రే నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు, రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు: రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్

సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఛార్జీల విషయంలో అమెరికా ఒత్తిడి ఉందా?

యూపీఐపై కొత్తగా తీసుకొచ్చిన 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్-ఎండీఆర్ నిర్ణయం ఇప్పుడు రాజకీయంగా చర్చకు దారితీసింది. ఆ ఛార్జీల నిర్ణయం వెనుక అమెరికా ఒత్తిడి ఉందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కేంద్ర ఆర్థిక శాఖ ఖండించింది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిడి లేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ క్రెడిట్ కార్డులకు యూపీఐలో అవకాశం కల్పించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నారన్న వాదనలో నిజం లేదని తెలిపింది.


### అమెరికా కార్డులకు ప్రయోజనం ఏంటి?

యూపీఐలో క్రెడిట్ లావాదేవీలకు ప్రస్తుతం రూపే క్రెడిట్ కార్డులకు మాత్రమే అవకాశం ఉందని ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం-ఐఖీూ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 15న ఎన్‌పీసీఐ విడుదల చేసిన తాజా సర్క్యులర్‌లో కూడా ఇదే విధానం ఉందని తెలిపింది. ఇతర దేశాలకు చెందిన క్రెడిట్ కార్డులను యూపీఐ క్రెడిట్ లావాదేవీలకు అనుసంధానం చేసే అవకాశం ఇవ్వలేదని పేర్కొంది. అందువల్ల 0.4 శాతం ఎండీఆర్ నిర్ణయం అమెరికా క్రెడిట్ కార్డు సంస్థలకు ప్రయోజనం కల్పించేందుకు తీసుకున్నదనే ఆరోపణకు ఆధారం లేదని కేంద్రం చెబుతోంది. యూపీఐలో రూపే క్రెడిట్ కార్డులను వినియోగదారులకు ప్రధాన ఎంపికగా మార్చడమే తమ విధానమని ఐఖీూ తెలిపింది. అమెరికా ఎలక్ట్రానిక్ చెల్లింపుల సంస్థలకు యూపీఐలో సమాన అవకాశాలు లేవంటూ అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం-యూఎస్‌టీఆర్ 2026 నివేదికలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్రం వివరణ ఇచ్చింది. ఎన్‌పీసీఐ ప్రకారం, ఎంపిక చేసిన అధిక విలువైన యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ తీసుకురావడం వెనుక ప్రధాన కారణం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఆదాయ నమూనా కల్పించడమే. యూపీఐలో ప్రస్తుతం పెద్ద సంస్థల ఆధిపత్యం ఎక్కువగా ఉందని కేంద్రం చెబుతోంది. 2020లో థర్డ్ పార్టీ యాప్ ప్రొవైడర్లకు 30 శాతం మార్కెట్ వాటా పరిమితిని ఎన్‌పీసీఐ తీసుకొచ్చింది. అయితే చిన్న కంపెనీలు మార్కెట్లో పెద్ద సంస్థలతో పోటీ పడేందుకు తగిన ఆదాయ మార్గం లేకపోవడంతో ఆ పరిమితిని అమలు చేయడం కష్టంగా మారిందని తెలిపింది. ఎంపిక చేసిన అధిక విలువ లావాదేవీలపై ఎండీఆర్ విధించడం ద్వారా చిన్న సంస్థలకు కూడా ఆదాయ మార్గం ఏర్పడుతుందని

## టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ - భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు: చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

కాశీ విశ్వనాథ్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. రక్షణమంత్రి రాజ్ నాథ్, కేంద్రమంత్రులు చిరాగ్ పాసవాన్, పంకజ్ చౌదరి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తో కలిసి సీఎం చంద్రబాబు ఆలయంలో పూజలు నిర్వహించారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు : అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు, "ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా మారబోతుంది. భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. సానుకూల దృక్పథం ఉంటే ఉన్నతస్థానాలకు వెళ్లగలరు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్లమంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నారు. కొవిడ్



సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. కొవిడ్ సమయంలో 140 కోట్ల మందిని ప్రధాని మోదీ కాపాడారు. ప్రధాని మోదీ ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు ప్రధాని మోదీ కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది, ప్రస్తుతం భారత్‌లోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతుంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. బేటీ బచావో బేటీ పఢావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతోందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రధాని మోదీ ప్రపంచానికి చూపించారు. దేశంలో తీవ్రవాదం లేకుండా ప్రధాని మోదీ చర్యలు చేపట్టారు. ప్రధాని మోదీ చర్యల వల్ల దేశంలో తీవ్రవాదం అంతమైంది. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను ప్రధాని పరిష్కరించారు. అయోధ్యలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తాం.

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం: కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

మొదటి పేజి తరువాయి

జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ



చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్
## ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. ఇప్పటికే దేశంలో 12 చిప్ తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని ప్రధాని వెల్లడించారు. రానున్న దశలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. చిప్ డిజైన్, అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాకుండా, చిప్ తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, ముడి పదార్థాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాలను కలిపి పూర్తి సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని వివరించారు.

### మిషన్ 2.0కు భారీగా నిధులు

భారత్ సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ప్రభుత్వం కేటాయింపులను భారీగా పెంచిందని మోదీ తెలిపారు. మొదటి దశలో 8 బిలియన్ డాలర్లుగా ఉన్న కేటాయింపులను 13.5 బిలియన్ డాలర్లకు పెంచినట్లు చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. దేశంలో సెమీకండక్టర్ రంగం ఎదగడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు



కొత్త కంపెనీలు, ఉద్యోగాలు, పరిశోధన అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కొన్ని ప్రాంతాలపై ఉన్న ఆధారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో భారత్‌కు ఇది ఒక పెద్ద అవకాశంగా మారుతుందని చెప్పారు.

### 15 రోజుల్లోనే!

భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో గత 15 రోజుల పరిణామాలను చూస్తే అర్థమవుతుందని మోదీ అన్నారు. సెప్టెంబర్‌లో ముంబయిలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ జరిగిందని గుర్తుచేశారు. అక్కడ ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటం టెక్నాలజీల ద్వారా సమ్మిళిత ఆర్థిక సేవలపై చర్చ జరిగిందన్నారు. అదే సమయంలో దేశంలో సుమారు 3 వేల కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. దీనివల్ల దేశవ్యాప్తంగా సరుకు రవాణా వేగం పెరుగుతుందని, లాజిస్టిక్స్ మరింత మెరుగవుతాయని తెలిపారు. మెరుగైన రవాణా వ్యవస్థ తయారీ రంగానికి మరింత బలాన్ని ఇస్తుందని మోదీ చెప్పారు.

### ఆర్థిక వృద్ధి- ప్రపంచ నమ్మకం

భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ప్రధాని అన్నారు. అదే సమయంలో ప్రపంచ దేశాలకు భారత్‌పై ఉన్న విశ్వాసం కూడా పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుత సవాళ్ల మధ్య కూడా దేశం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన రేటింగ్ సంస్థ జేసీఆర్ఏ భారత్ రేటింగ్‌ను పెంచిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. భారత్‌లో తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఎదగడానికి సెమీకండక్టర్ రంగం ఉపయోగపడుతుందని మోదీ తెలిపారు.

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు



ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

## 2వేల పానీపూరీలతో 13 అడుగుల గణేశుడి విగ్రహం తయారీ

మొదటి పేజి తరువాయి

### పానీపూరీలతో భారీ గణపతి- వైరల్ అవుతున్న వినూత్న విగ్రహం వీడియో
### రెండు నెలల పాటు శ్రమించి గణేశుడి విగ్రహానికి ప్రాణం పోసిన కళాకారులు

ఢిల్లీ : దేశవ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఈ నవరాత్రుల్లో భక్తులు తమ భక్తికి సృజనాత్మకతను జోడించి వినూత్న రీతిలో భారీ గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించడాన్ని మనం చూస్తుంటాం. ఈ ఏడాది కూడా మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వీటిలో పుణెలో కొలువుదీరిన 'పానీపూరీ గణపతి' విగ్రహం ఒకటి. ఈ పానీపూరీ గణనాథుడ్ని చూసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. అందుకే ఈ స్టోరీలో ఈ భిన్నమైన విగ్రహ తయారీకి ఎన్ని పానీపూరీలను వాడారు? ఆ విగ్రహం ఎత్తు ఎంత? దాన్ని ఎవరు తయారుచేశారు? తదితర విషయాలు తెలుసుకుందాం.

### రెండు నెలలు శ్రమించి

పుణెలోని ఫెర్గూసన్ కాలేజ్ రోడ్డులో ఉన్న 'గణేశ్ భేల్' షాపు యజమానులైన రూపేశ్, దినేశ్ గుడ్మేవార్ (ఇద్దరు సోదరులు) ఈ వినూత్న బొజ్జ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 21,000 పానీపూరీలను ఉపయోగించి 13 అడుగుల ఎత్తైన విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇద్దరు సోదరులు రెండు నెలల పాటు శ్రమించి ఈ విగ్రహానికి అందమైన రూపానిచ్చారు. అంతేకాకుండా ఈ విగ్రహం పాడవకుండా ఉండేందుకు, దాని భద్రతను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఇద్దరు కళాకారులు నిరంతరం మండపం వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ పానీపూరీ గణపయ్యకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### సోదరుల అద్భుత కళాఖండం



స్వతహాగా కళాకారులైన రూపేశ్, దినేశ్ గుడ్మేవార్‌లు తమ వ్యాపారానికి సంబంధించిన పదార్థాలను ఉపయోగించి గణపయ్యకు ఒక విలక్షణమైన రూపాన్ని ఎలా ఇవ్వొచ్చని ఆలోచించారు. అప్పుడే వారికి తమ వ్యాపారంలో ముఖ్య భాగమైన పానీపూరీలతో గణేశుడి విగ్రహాన్ని తీర్చిదిద్దాలనే ఆలోచన వచ్చింది. అయితే ఈ ఆలోచన వినడానికి సులభంగా అనిపించినా, దానిని ఆచరణలో పెట్టడం అంత సులభం కాదనే విషయాన్ని ఆ సోదరులు గ్రహించారు. ఎందుకంటే పానీపూరీలు తేలికగా ఉంటాయి. అలాగే తేమకు సులభంగా ప్రభావితమవుతాయి. అందుకే విగ్రహం ఆకృతికి, స్థిరత్వానికి భంగం కలగకుండా పానీపూరీలను ఎలా అమర్చవచ్చనే దానిపై ఆ సోదరులు సుమారు ఆరు నెలల పాటు చర్చించి, అధ్యయనం చేశారు. రెండు నెలల క్రితం విగ్రహం రూపకల్పన పనులు ప్రారంభించారు.

'పూజ, దర్శనం కోసం వేరే విగ్రహం ఏర్పాటు'

వెదురు, కాగితంతో చేసిన ఫ్రేమ్‌పై 13 అడుగుల గణపతి విగ్రహం రూపుదిద్దుకునే వరకు పానీపూరీలను ఒక్కొక్కటిగా అమర్చామని రూపేశ్ వివరించారు. ఈ పెద్ద విగ్రహాన్ని కేవలం కళాత్మక ప్రదర్శన కోసం మాత్రమే రూపొందించామని చెప్పారు. పూజ, దర్శనం కోసం దాని పక్కన ఒక చిన్న గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించామని వెల్లడించారు. అందువల్ల భక్తులు పానీపూరీలతో చేసిన గణేశుడి విగ్రహాన్ని సందర్శించి, పక్కనే ఉన్న చిన్న విగ్రహం వద్ద పూజలు చేస్తున్నారని స్పష్టం చేశారు. "పానీపూరీలతో చేసిన ఈ ప్రతిష్ఠాత్మక గణేశుడి విగ్రహాన్ని చెక్కుచెదరకుండా చూసుకోవడం అంత సులువైన పని కాదు. అందుకే 24 గంటలూ అప్రమత్తంగా ఉంటున్నాం. ఎందుకంటే గాలిలో తేమ వల్ల పానీపూరీలు మెత్తగా అయిపోతాయి. అలాగే దుమ్ము, ధూళి, తేమ వల్ల పాడైపోతాయి. అందుకే విగ్రహాన్ని పర్యవేక్షించడానికి, ఏవైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించడానికి ఇద్దరు కళాకారులు మండపంలోనే ఉంటారు. పుణెలోని అనూహ్యమైన రుతుపవన వాతావరణం నుంచి ఈ భిన్నమైన విగ్రహాన్ని కాపాడటానికి అదనపు జాగ్రత్తలు కూడా తీసుకున్నాం" అని దినేశ్ స్పష్టం చేశారు.

### సేంద్రియ ఎరువుగా మారనున్న పానీపూరీలు

గణేశ్ నవరాత్రుల తర్వాత ఈ పానీపూరీ గణేశుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయమని సోదరులిద్దరూ (రూపేశ్, దినేశ్) చెప్పారు. అనంత చతుర్దశి తర్వాత అందరిలా ఈ విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయమని స్పష్టం చేశారు. అందుకు బదులుగా విగ్రహ తయారీలో వాడిన 21,000 పానీపూరీలను సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగిస్తామని అన్నారు. ఆహార పదార్థాలు జలాశయాల్లోకి చేరకుండా నివారించడం, అలాగే ఈ వేడుకను పర్యావరణహితంగా జరుపుకోవాలనే సందేశాన్ని ఇవ్వడం కోసం తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

# భూస్వాముల కోసమే పటేల్ సైన్యం పనిచేసింది.

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్.**

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.17 ప్రజా న్యూస్ నెట్వర్క్.. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభను నేడు షాపూర్నగర్ లో సిపిఐ,సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా యూసఫ్ పాల్గొని మాట్లాడుతూ హైద్రాబాద్ సంస్థానంలో నిజాం రజాకార్ల అరాచకానికి వ్యతిరేకంగా,భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమి కొరకు విముక్తి కొరకు కమ్యూనిస్టు పార్టీ పిలుపునిస్తే తెలంగాణ ప్రాంతంలోని ప్రతి పల్లె సాయుధ పోరాటంలో పాల్గొని భూస్వాముల భూములను పేద ప్రజలకు పంచి నిజాంను గద్దె దింపే సమయంలో నిజాం తన ఓటమి నిర్ణయమైందని భావించి కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే భూస్వాముల భూములు పోతాయని అప్పటి నెహ్రూ ప్రభుత్వానికి విలీనం అవుతమౌ అని సందేశం వచ్చాకే పటేల్ సైన్యం వచ్చిందని,కానీ ఆ సైన్యం రజాకార్లతో యుద్ధం చెయ్యకుండా నిజాంను గోవర్నరుగా నియమించడం భూస్వాములకోసమే తప్ప ప్రజా రాజ్యం కోసం కాదని అన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,సిపిఎం మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ సాయుధ పోరాటం చేసిన పార్టీ కమ్యూనిస్టు పార్టీనేనని దానికి వారసులం మనమే తప్పిస్తే బీజేపీ కాంగ్రెస్ కు లేదని అన్నారు.సాయుధ పోరాటం లేకపావడం వల్ల బీజేపీ చరిత్రను వక్రీకరిస్తూ విమోచనం,హిందూ ముస్లిం ల మధ్యగా గొడవగా చిత్రీకరిస్తూ చరిత్రను మారుస్తున్నారని యెన్నటికైనా నిజం ప్రజలకు తెలుస్తుందని బీజేపీ అబద్దాలు తేలిపోతుందని అన్నారు.




ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ కౌన్సిల్ సభ్యులు నర్సింహారెడ్డి,సిపిఐ నాయకులు బక్కరి మల్లేష్, శ్రీనివాస్, మహేందర్,సిపిఎం శ్రీనివాస్,సిపిఐ మహేందర్, రాజేష్,రమేష్,మహేష్,భీష్మ,సుంకిరెడ్డి,శేఖర్,ప్రవీణ్,రవి,మల్లేష్ లతో పాటు వందలాది మంది నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని కార్పొరేటర్ జగన్ హామీ**

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.17. ప్రజా న్యూస్ నెట్వర్క్ .. జగద్గిరిగుట్ట పరిధిలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. జగద్గిరిగుట్ట విశ్వకర్మ, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ప్రభు చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా జగన్ విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సృష్టి నిర్మాణంలో, సమాజ అభివృద్ధిలో విశ్వకర్మల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. స్వర్ణకార సంఘం భవనం/కార్యకలాపాల కోసం స్థానిక నాయకత్వం అభ్యర్థన మేరకు 200 గజాల స్థలాన్ని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించేలా చొరవ తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రభు చారితో పాటు ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ చారి, శ్రీనివాస్ చారి. లకోజు శివ సాయి సత్తిబాబుచందు రాఘవేంద్రంసంఘం ప్రతినిధులు, స్వర్ణకారులు, స్థానిక విశ్వకర్మ కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.



# తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ**

**తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఘనంగా నివాళులు**

(సూర్యాపేట జిల్లా) సెప్టెంబర్ 17,ప్రజా న్యూస్ నెట్వర్క్,షేక్. అబ్దుల్ రజాక్,జిల్లా ప్రతినిధి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

**అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి :**

తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి :**

విద్యార్థులు తెలంగాణ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విశ్వకర్మ జయంతి వేడుకల్లోనూ పాల్గొన్న మంత్రి :**

అనంతరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొని విశ్వకర్మకు నివాళు లర్పించారు. సంప్రదాయ వృత్తులు, శ్రమజీవుల సేవలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు




# సంగారెడ్డి రామ్ నగర్ రామ్ మందిర్ గణపతి వేడుకల్లో అలరించిన సంగీత విభావరి

**- భక్తి గీతాలు ఆలపించిన సినీ నేపథ్య గాయకులు**

**- మండపంలో డోలక్ వాయిస్తూ భజన పాటలు పాడిన జగ్గారెడ్డి**

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 17

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి రాంనగర్ రామ్ మందిర్ లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి ఘనంగా సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ సినీ నేపథ్య గాయకులు భక్తి గీతాలు ఆలపించి భక్తులను అలరించారు. అంతకుముందు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గణపతి మండపంలో డోలక్ వాయిస్తూ భజన పాటలు పాడారు. ఓవైపు భక్తి గీతాలు మరోవైపు భజన పాటలతో రామ్ మందిర్ ప్రాంతం మార్మోగింది. గురువారం తెల్లవారుజాము వరకు ఈ సంగీత విభావరి కార్యక్రమం అట్టహాసంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, జయా రెడ్డి పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# విజయ గణపతి మండపం వద్ద ఘనంగా అన్నదాన మహోత్సవం

**-19వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాస్ కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అన్నదానం**

**-భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసుల సహకారం..**

**ముఖ్య అతిథులకు ఘన సన్మానం**

(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 17, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్ పట్టణంలోని 19వ వార్డు శ్రీనగర్ కాలనీలో కౌన్సిలర్ వల్లపుదాస్ కృష్ణగౌడ్, టీమ్ 19 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ గణపతి మండపం వద్ద గురువారం ఘనంగా అన్నదాన మహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజల అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుల సహకారంతో నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులను వల్లపుదాస్ కృష్ణగౌడ్, టీమ్ 19 సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, మహిళలు, యువత, భక్తులు, కాలనీ ప్రజలు, టీమ్ 19 సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో 19వ వార్డు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కౌన్సిలర్ వల్లపుదాస్ కృష్ణగౌడ్ ఆకాంక్షించారు.



# గిరిజన రిజర్వేషన్ పెంపు నిర్ణయానికి నాలుగేళ్లు

**-కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గిరిజన నేతలు**

**-గిరిజనుల ఆత్మగౌరవానికి రిజర్వేషన్ పెంపు నిర్ణయం: బీఆర్ఎస్ నేతలు**



(త్రిపురారం మండలం) సెప్టెంబర్ 17, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :త్రిపురారం మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. గిరిజన రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమం

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.17 ప్రజా న్యూస్ నెట్వర్క్

షాపూర్‌నగర్‌లోని హెచ్ఎంటీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ కమ్యూనిటీ హాల్‌లో వినాయక నవరాత్రుల సందర్భంగా గురువారం భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయకుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, క్రమబద్ధంగా అన్నప్రసాదాన్ని అందించారు. అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులకు, అన్నదాతలకు కృతజ్ఞతలు తెలిపారు..ఈ అన్నదాన కార్యక్రమానికి ముందొచ్చి మేము వినాయకుని యొక్క కృపకు ముందుంటామని అన్న ప్రసాదం పెట్టడం జరిగింది.. అన్న ప్రసాదం దాతలు, రాంబాటి, పరుశురాం, ఏకాంబరం గుప్త, భవాని జువెలర్స్, సజన్‌లాల్ బాటి, అన్నదాతలుగా సహకరించారు.. వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ వినాయకుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు..భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటుతున్న నిర్వాహకులను స్థానికులు అభినందించారు.



## గుర్రంపోడ్ మండల కేంద్రలోని పిట్టలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రజా పాలనా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

(ప్రజా న్యూస్ రిపోర్టర్ గుర్రంపోడు ప్రతినిధి) ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సూదిని సునీత జగదీశ్వర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా పాలన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మారపాక అంబేద్కర్, గ్రామ సెక్రెటరీ సుష్మాంజలి, వార్డ్ మెంబర్లు లలిత రాజశేఖర్,పాలడుగు సైదమ్మ శేఖర్, పాలడుగు పవన్, శ్రీశైలం పాల్గొన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




# మహంకాళిగూడెంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**-నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు**

**-స్థలాన్ని పరిశీలించిన సీఐ చరమంద రాజు, ఎస్సై కోటేష్**

(పాలకీడు మండలం) సెప్టెంబర్ 17, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :పాలకీడు మండలం మహంకాళిగూడెంలో గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన స్థలాన్ని హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమంద రాజు, పాలకీడు ఎస్సై కోటేష్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మహంకాళిగూడెం సర్పంచ్ దాసు ప్రేమ్‌కుమార్, ఎమ్మార్వో వాజిద్ అలీ, ఎంపీడీవో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# మెగా జాబ్ మేళా రిజిస్ట్రేషన్‌పై విద్యార్థులకు అవగాహన

**మిట్స్ కళాశాలలో చిలుకూరు ఎస్సై ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం**

(చిలుకూరు మండలం) సెప్టెంబర్ 17, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :చిలుకూరు ఎస్సై ఆధ్వర్యంలో మిట్స్ కళాశాల విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మెగా జాబ్ మేళా రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. జాబ్ మేళాలో పాల్గొనేందుకు పేర్ల నమోదు విధానం, రిజిస్ట్రేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుగానే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

